సాక్షి
నిర్మల్
మంగళవారం । 7 । మార్చి । 2023



'గిరి' పల్లెల్లో రంగోత్సవం!

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పండుగలు అన్నివర్గాలకు భిన్నంగా ఉంటాయి. అన్ని పండుగలకంటే భిన్నంగా హోలీ వేడుకలు జరుపుకుంటారు. 8లో▸



ముందస్తు హోలీ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం ముందస్తు హోలీ సంబురాలు నిర్వహించారు. చిన్నారులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 / 19.7

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సహజ రంగులనే వాడాలి



సహజ సిద్ధమైన రంగులతో కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రజలు సహజసిద్ధమైన రంగులతోనే హోలీ జరుపుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హోలీ పండుగ కోసం తయారు చేసిన సహజ రంగులను ప్రజా ఫిర్యాదుల విభాగంలో జిల్లా అధికారులకు సోమవారం పంపిణీ చేశారు. పర్యావరణానికి మేలు చేసే రంగులతో హోలీ జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రకృతిలో లభించే మోదుగ పూలు (గోగు పువ్వులు), శరీర ఉష్ణోగ్రతను తగ్గించే పచ్చ కర్పూరం పొడి వాడి ఈ రంగులు తయారు చేశామని డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళా సమాఖ్య సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన అట్రాసిటీ మెంబర్స్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సభ్యులు

నర్సాపూర్(జి): కలెక్టర్ వరుణ్‌రెడ్డిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు ముడుసు సత్యనారాయణ, బర్కుంట గంగారాం, బొడ్డు లక్ష్మణ్ సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.


ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందిస్తామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు థాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

'పీఎంశ్రీ'లో అవకతవకలపై విచారణ జరిపించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు


నిర్మల్ రూరల్: జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలల ఎంపికలో అవకతవకలపై విచారణ జరిపించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈవో రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈనెల 12లోపు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు దాసరి శంకర్, బక్కన్న, షబ్బీర్ అలీ, విజయ్‌కుమార్, రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు, బిల్లులు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. నిత్యవసర ధరలు పెరిగిపోతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.



కామ దహనం



ప్రకృతిలోని అందాలన్నీ ఆవిష్కరించే వసంతరుతువులో జరుపుకునే పండుగ హోలీ. వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా అంతటా కామదహనం నిర్వహించారు. ఇళ్లలోని పాత వస్తువులను కూడళ్లలో పేర్చి పిడకలు వేసి పూజలు చేశారు. అనంతరం దహనం చేశారు. తర్వాత కామునిచుట్టూ తిరుగుతూ బూడిదను బొట్టుగా పెట్టుకున్నారు. ఇళ్లకు తీసుకెళ్లారు. మంగళవారం హోలీ వేడుకలకు పల్లె, పట్టణం, ఊరు, వాడా సిద్ధమయ్యాయి. చిన్నా పెద్ద అంతా రంగులు కొనుగోలు చేశారు.
- నిర్మల్‌చైన్‌గేట్/సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

శిశువులకు సంజీవని

- జిల్లా ఆస్పత్రిలో స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్
- ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారులకు ఉత్తమ సేవలు
- నాలుగేళ్లలో 5,451 మంది పిల్లలకు చికిత్స



స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్‌లో పసికందుకు చికిత్స చేస్తున్న వైద్యుడు

నిర్మల్‌చైన్‌గేట్: పసికందుల పాలిట సంజీవనిగా మారింది ప్రభుత్వ ఆస్పత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్. కార్పొరేట్ ఆస్పత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసినా లభించని వైద్యం.. జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో ఉచితంగా లభిస్తోంది. ఈ కేంద్రం ప్రారంభించినప్పుడు ఐదుగురు చిన్నారులకు మాత్రమే వైద్యం చేసేలా వసతులు ఉండేవి. ప్రస్తుతం ఇక్కడ ఒకేసారి 20 మంది పసికందులకు చికిత్స అందుతోంది. నవజాత శిశువులకు వచ్చే రకరకాల రుగ్మతల నుంచి కాపాడేందుకు ఈ కేర్ సెంటర్ ఉపయోగపడుతోంది. శిశువు ఉమ్మనీరు తాగినా, ఊపిరి సరిగా తీసుకోకపోయినా, ఎక్కువ బరువుతో పుట్టినా, ఊపిరితిత్తుల సమస్య తలెత్తినా ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అలాగే శిశువు పుట్టిన తర్వాత ఉష్ణోగ్రతను నార్మల్ చేయడానికి హైడ్రోథెరపీ యూనిట్లతో కామెర్లు వంటి వాటిని తగ్గించేలా చర్యలు తీసుకుంటారు. చిన్నారుల్లో ఉష్ణోగ్రతను నియంత్రించడానికి రేడియంట్ వార్మర్లు వినియోగిస్తారు. పసికందులకు ఆక్సిజన్ తక్కువగా అందినప్పుడు, తక్కువ బరువ తో పుట్టినప్పుడు సీప్యాప్ వెంటిలేటర్లు ఉపయోగిస్తారు. ఈ విభాగంలో ముగ్గురు వైద్యాధికారులు, తొమ్మిది మంది స్టాఫ్ నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు హెల్పర్లు, ముగ్గురు సెక్యూరిటీ, ఒక ల్యాబ్ టెక్నీషియన్ సేవలు అందిస్తున్నారు..

ఏడాది వరకు ఉచిత వైద్యం..

గతంలో తల్లి ప్రసవించిన తర్వాత శిశువు ఆరోగ్యం సక్రమంగా లేకుంటే ఇతర పట్టణాల్లోని ఆస్పత్రులకు రెఫర్ చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రసవం జరిగిన తర్వాత 90 రోజుల వరకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. డిశ్చార్జి అయ్యాక కూడా ఏడాది వరకు వారే ఉచిత వైద్యం చేస్తారు. మూడు నెలలకు ఒకసారి కేర్ యూనిట్‌కు రప్పించి, శిశువును పరీక్షించి తగిన చికిత్స అందిస్తున్నారు. జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో ఉన్న ఈ యూనిట్‌లో నెలకు సుమారు 150 మంది బాలింతలు చేరుతున్నారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

నవజాత శిశువులకు వరం..

జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నవజాత శిశు కేంద్రం చంటి పిల్లలకు వరంగా మారింది. శిశు మరణాలను తగ్గించే ఉద్దేశంతో 2012లో ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగంలో డాక్టర్లు వాసు, వంశీ, స్రవంతి, ప్రదీప్, సుకేశ్, సుసూద్ వైద్య సేవలు అందిస్తుండగా, నోడల్ అధికారిగా డాక్టర్ స్వప్న వ్యవహరిస్తున్నారు. ఇక్కడ 24 గంటలూ వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది. ప్రసూతి ఆస్పత్రిలో జన్మించిన పిల్లలకే కాకుండా చుట్టుపక్కల పీహెచ్సీల్లో, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పుట్టిన చిన్నారులకు సైతం వైద్యసేవలు అందిస్తున్నారు.

నాలుగేళ్లలో 5 వేలకుపైగా చిన్నారులకు..

ఎస్ఎన్‌సీయూ విభాగంలో గడిచిన నాలుగేళ్లలో 5,451 మంది నెలలోపు పసికందులకు వైద్యం అందించారు. ఈ విభాగం ఏర్పాటుకు ముందు ఎక్కువగా శిశు మరణాలు సంభవించేవి. నవజాత శిశు సంక్షేమ కేంద్రం ఏర్పాటు చేసిన తర్వాత శిశు మరణాల శాతం బాగా తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ 2019లో 1,134 మంది చిన్నారులకు, 2020లో 1,674 మందికి, 2021లో 1,327 మందికి, 2022లో 1,316మంది పసికందులకు చికిత్స చేశారు. వీరిలో 1000 గ్రాముల లోపు బరువున్న పిల్లలు 351 మంది, 1000గ్రాముల పైన బరువుతో పుట్టిన వారు 1,606 మందికి మెరుగైన వైద్యసేవలు అందించారు.

సద్వినియోగం చేసుకోవాలి...



నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ప్రస్తుతం 10 నుంచి 20 మంది శిశువులకు చికిత్స అందిస్తున్నాం. శిశువులకు ఈ తరహా వైద్యసేవలు అందించాలంటే ప్రైవేటు ఆస్పత్రుల్లో భారీగా ఖర్చవుతుంది. కానీ ఇక్కడ అన్ని సేవలను ఉచితంగా అందిస్తున్నాం. ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షకులు

పల్లె బాటలో ట్రెయినీ అధికారులు



ఎర్వచింతల్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ట్రెయినీ అధికారులు



పసుపు దిగుబడిని పరిశీలిస్తున్న అధికారుల బృందం



పార్‌పెల్లిలో కంకులు రిక్కుతున్న అధికారులు

- ఖానాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన
- కడెంలో ఉపాధి పనుల పరిశీలన
- లక్ష్మణచాందలో పాఠశాలల రికార్డులు తనిఖీ

ఖానాపూర్/కడెం/లక్ష్మణచాంద: శిక్షణలో భాగంగా మూడు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్న ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్ఎస్ అధికారులు సోమవారం వివిధ మండలాల్లో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పాఠశాలల రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ గ్రామానికి వచ్చిన ఆరుగురు మహిళా అధికారుల బృందం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించింది. ట్రెయినీ అధికారులు ముస్కాన్ జైన్, కీర్తి, చాయ సింగ్, షికారాయ్, రూపాలిదశరత్ కర్నె, అంజలి మోరియాలు చిన్నారులు, గర్భిణి, బాలింతలు తదితరులకు అందుతున్న సేవలను పరిశీలించారు. గ్రామంలోని పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం కడెం మండల కేంద్రంలోని మిషన్ భగీరథ పథకాన్ని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో మల్లేశ్, సర్పంచ్ కొడారి గోపాల్, ఎంపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో సందీపన్ సర్కార్, బంటి కుమార్, ఆలీషాఖానం, ప్రీతంసేన్, సౌమ్య బుదిరాజా పర్యటించారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న ఫిష్‌పాండ్ పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అనంతరం మహిళా సంఘాలతో సమావేశమై పొదుపు, రుణాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో వెంకటేశ్, సర్పంచ్ బొడ్డు గంగన్న, ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం, కార్యదర్శి మనోజ్ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి గ్రామంలో ఆదివారం సందర్శించిన వివిధ ప్రాంతాల తాలుకూ వివరాలతో గ్రామం చిత్రం వేశారు. ఇళ్లు, చెరువులు, పంటల వివరాలతో కూడిన మ్యాప్ వేశారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వీరి వెంట ఎంపీవో నసీరుద్దీన్, సర్పంచ్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు ఉన్నారు. అంతకుముందు అధికారులు గ్రామీణ వాతావరణాన్ని ఆస్వాదించారు. బావివద్ద కోరను, తాడును పరిశీలించారు. నీళ్లు తోడే విధానం తెలుసుకున్నారు. ఆసమయంలో ఓ రైతు ఎడ్ల బండిపై చేసుకు వెళ్తుండగా దానిపై ఎక్కి వెళ్లారు. కూలీలతో కలిసి మొక్కజొన్న కంకులు తీశారు. సాగుకు ఎంత పెట్టుబడి అవుతుంది, ఎంత దిగుబడి వస్తుంది అనే వివరాలు తెలుసుకున్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- గ్రీవెన్స్‌కు తగ్గిన వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఈసారి వినతులు తగ్గాయి. గతవారం 27 వినతులు రాగా ఈవారం హోలీ పండుగ నేపథ్యంలో కేవలం 6 అర్జీలు మాత్రమే అందాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు.

సమన్వయంతో పనిచేయాలి..

ప్రజా ఫిర్యాదుల విభాగం అనంతరం అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అర్జీదారుని సమస్య సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల్లో వెంటనే పరిష్కారమయ్యే వాటిని అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు. మిగతావి రెండు మూడు రోజుల్లో పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రతీ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి ద్వారా చేపడుతున్న పనులు టైంలైన్ ఏర్పాటు చేసుకుని గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులు చురుకుగా ఉండేందుకు చదువుతోపాటు ఆటలు, క్విజ్ కాంపిటేషన్ తదితర పోటీలు నిర్వహించాలని తెలిపారు. సీపీఆర్‌పై ఈనెల 13న శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్వో లోకేష్, ఆర్డీవో స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీడీసీ సభ్యులు భూమి సాగు చేయనివ్వడం లేదు



భూమన్న

సారంగాపూర్ మండలం జామ్ వీడీసీ సభ్యులు తమ భూమి సాగు చేయనివ్వడం లేదని ముద్రం భూమన్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ముద్రం పోసవ్వకు సర్వే నంబర్‌లో 952 /2 ముద్రం భూమన్నకు సర్వే నంబర్ 582/45లో, తెనుగు పిరాజికి సర్వే నంబర్ 582/48లో ఉరే భూమన్నకు సర్వే నంబర్ 582/46లకు చెందిన సాగుభూమి జాం గ్రామ శివారులో ఉందని తెలిపారు. ఈ భూమిని 35 సంవత్సరాల నుంచి తాము సాగుచేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ భూమిని వీడీసీ సభ్యులు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ భూమి లోపలికి ట్రాక్టర్, ఎడ్లు వెళ్ళకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. భూమిని మళ్లీ సాగుచేసునే అవకాశం కల్పించాలని కోరాడు.

వీడీసీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నిరసన తెలియజేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌రూరల్ మండలం కనకాపూర్‌కు చెందిన దళిత రైతు భూమిని కబ్జా చేసిన అబ్దుల్లాపూర్ వీడీసీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ దళితుడి భూమిని కబ్జా చేసి బిల్డింగ్ నిర్మించి వీడీసీ సభ్యులు పెత్తనం చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే అబ్దుల్లాపూర్ వీడీసీపై అట్రాసిటీ కేసును నమోదు చేసి, దళిత రైతుకు భూమిని తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. బాధిత రైతు ఏడాదిగా పోరాటం చేస్తున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. ధర్నాలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్ప లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేళ్లి నరసయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, సహాయ కార్యదర్శి టి.ముత్తన్న, లోకేశ్వరం మండల నాయకుడు దేవేందర్, బాధిత రైతు కుటుంబం, కనకాపూర్ గ్రామ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్‌టౌన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బస్‌డిపో కార్యాలయంలో సోమవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా కండక్టర్లకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ మహిళా కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. అనంతరం డీఆర్డీవో మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వాలు అన్నిరకాల అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సాయన్న, సహాయ మేనేజర్లు రాజశేఖర్, శ్రీకర్, మహిళ కండక్టర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం రావాలి

- ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మామడలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

మామడ: తెలంగాణలో బీఆర్ఎస్ పాలన పోవాలని, ఇందిరమ్మ రాజ్యం రావాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కాంగ్రెస్ పోరు యాత్రలో భాగంగా సోమవారం మామడ మండలం కొరిటికల్, మామడ గ్రామాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. స్వరాష్ట్రం సాధించుకుని ఎనిమిదేళ్లు పూర్తయినా నీళ్లు, నిధులు, నియమాకాల ఆకాంక్షలు నేటికి నెరవేరలేదన్నారు. పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తుందని విమర్శించారు. రుణమాఫీ హామీ నెరవేర్చలేదని, నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం సిలిండర్ ధర పెంచి పేదల భారం మోపిందన్నారు. కాంగ్రెస్ పేదలకు భూములు ఇస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. ఇళ్లు లేని పేదలకు కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే, డబుల్ బెడ్రూం ఇస్తామన్న కేసీఆర్ హామీ విస్మరించారని అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని గిరిజనులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం అందించిన భూములను డి1 పట్టాల పేరుతో బీఆర్ఎస్ నాయకులు ఆక్రమిస్తున్నారని తెలిపారు. మంత్రి ఐకేరెడ్డి ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాపురెడ్డి, మండల కన్వీనర్ కోండ్ర రాజారెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, సంతోష్, నవీన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

- అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్షం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఖానాపూర్ మండలంలో లక్కీ డ్రాతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ఎంపిక తరుణంలో స్థానిక నాయకులు, అధికారుల సమన్వయ లోపంతో మొదటి ప్రాధాన్యం ఉన్న అర్హులను కాదని అనర్హులకు, అయిన వాళ్లకు ఇల్లు మంజూరు చేసి, అర్హులకు అన్యాయం చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ అధికారులు తప్పు చేశారని అంగీకరించినట్లు తెలిపారు. లక్కీడ్రాతో సంబంధం లేకుండా అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో ఖానాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నంది రామయ్య, బీజేపీ ఖానాపూర్ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, నాయకురాలు జక్కుల గంగమణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా వర్సిటీ వీసీకి అభినందనలు



విజ్జులతతో వీసీ వెంకటరమణ, తదితరులు

భైంసా: తెలంగాణ మహిళా యూనివర్సిటీ వీసీగా నూతన బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ విజ్జులతకు బాసర ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ సోమవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉన్నత విద్య నందించేందుకు మహిళా విశ్వవిద్యాలయం ప్రధాన పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక్కడి నుంచి నూతన ఆవిష్కరణలు రావాలని ఆకాంక్షించారు. త్వరలోనే మహిళా విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



కాలిన పత్తిని చూపుతున్న బాధిత రైతు

బేల: మండలంలోని భవానీగూడ(ఇ) గ్రామంలో రైతు చిలంచెట్టి అనిల్‌కు చెందిన సోమవారం పత్తి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఇంట్లో 25 క్వింటాళ్ల పత్తి నిల్వ ఉంచగా, షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగువారు నీళ్లు పట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అప్పటికే నాలుగైదు క్వింటాళ్ల పత్తి కాలిపోయిందని, అధికారులు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

రాంటేక్‌లో చోరీ

ముధోల్: మండలంలోని రాంటేక్ గ్రామంలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జిడ్డు గంగాధర్, భార్య రాజమణిలు ఆదివారం తానూర్ మండలం హంగిర్గ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం వేసిన ఇంటిని గుర్తుతెలియని వ్యక్తులు గుర్తించారు. రాత్రి ఇంటి వెనుక భాగంలో ఉన్న తలుపులు తొలగించి ఇంట్లోకి చొరబడి రూ.36 వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు గంగాధర్ తెలిపాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నాడు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



టవర్‌పై ఉన్న లక్ష్మణ్

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో మారంశెట్టి లక్ష్మణ్ సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు టవర్ ఎక్కిన లక్ష్మణ్ రాత్రి అయినా దిగలేదు. ఏఎస్సై భైసర్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని టవర్ దగ్గర ఉండి దించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, ఇంట్లో గొడవ కారణంగా, మద్యానికి బానిసై లక్ష్మణ్ సెల్‌టవర్ ఎక్కినట్లు స్థానికులు తెలుపుతున్నారు. దళితబంధు ఇవ్వాలని టవర్ ఎక్కినట్లు మరికొంత మంది పేర్కొంటున్నారు.

బైక్ దొంగ అరెస్ట్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో బైక్ దొంగను సోమవారం అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై రమణ తెలిపారు. సిటీ కన్వెన్షన్ హాల్ ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను చోరీ చేస్తుండగా సోన్ మండలం గంజాల్ గ్రామానికి చెందిన మక్కల సాయికుమార్(22ను) పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



గిరి పల్లెల్లో రంగోత్సవం!



పప్పు, రొట్టెలతో నైవేద్యం సమర్పిస్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పండుగలు అన్నివర్గాలకు భిన్నంగా ఉంటాయి. తమదైన శైలిలో పండుగలు జరుపుకోవడంలో తమకు తామే సాటి. అన్ని పండుగల కంటే భిన్నంగా హోలీ వేడుకలు జరుపుకుంటారు. వేడుకలు తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. నేడు గిరిజన ఆదివాసీ గ్రామాల్లో హోలీ(దురాడి) వేడుకలపై 'సాక్షి' కథనం.

- సంప్రదాయబద్ధంగా కాముడి దహనం
- నేడు దురాడి (హోలీ) సంబురం
- డోలు, భాజాలతో తరలివెళ్లిన ఆదివాసీలు
- ఏళ్ల కాలం నుంచి వస్తున్న ఆచారం



ముస్తాబైన పులారాలు

హోలీ వేడుకల్లో భాగంగా సోమవారం కామునిదహనం నిర్వహించారు. వెదురు కర్రలతో రెండు పులారాలను తయారు చేసి వాటికి ఐదుచోట్ల కుడుకలు, అప్పాలు, గోగుపూలు, చక్కెరపేర్లు, వంకాయ అమర్చారు. అనంతరం డోలు, సన్నాయి మేళాలతో గ్రామ పొలిమేర వరకు తరలివెళ్లి కామునిదహనం చేశారు. అంతకు ముందు రెండు వెదుర్లకు వృద్ధుడు, వృద్ధురాలు అని పేరు పెట్టి వాటికి పులారాలను కట్టారు. కిందిభాగంలో నిప్పంటించారు. గ్రామ పటేల్ పూజలు చేసిన అనంతరం వారి ఆచారం ప్రకారం మంటపై వరుసగా దూకారు. అనంతరం గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి తీసుకువచ్చిన పప్పు, రొట్టెలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కాముని దహనం చేసిన చోటే రాత్రి బస చేశారు.

కుడుకలు ఇవ్వడం ఆచారం

ఆదివాసీల ఆచారంలో భాగంగా గ్రామ పటేల్, దేవారీలకు గ్రామస్తులంతా కుడుకులు ఇస్తారు. కుడుకలతో పాటు చక్కెర పేర్లు కూడా ఇస్తారు. ఇలా కుడుకలు ఇచ్చిన వారినే గ్రామస్తులుగా పరిగణిస్తారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. ఈ కార్యమంతా కాముని దహనం రోజు జరుగుతుంది. అనంతరం వాటిని లెక్కిస్తారు. ఊర్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో వాటికి సమానంగా కుడుకలు, పేర్లు వచ్చాయా? అని పరిశీలిస్తారు.

సతీయుగం నుంచి వస్తున్న ఆచారం

సతీయుగంలో రావణాసురుడు సీతను అపహరిస్తాడు. సీతకోసం రాముడు రావణాసురుడితో యుద్ధం చేస్తాడు. కానీ ఎన్ని బాణాలు వేసినా రావణాసురుడు మృతి చెందలేదు. రావణాసురుడి నాభిలో బాణం గుచ్చితే తప్ప మృతి చెందడని విభీషణుడు అసలు రహస్యం చెప్పాడు. దీంతో రాముడు రావణాసురుడి నాభిలో బాణం వేయడంతో మరణిస్తాడు. చెడుపై మంచికి జరిగిన విజయానికి గుర్తుగా భావించిన అయోధ్యవాసులు ప్రతీ సంవత్సరం ఈ హోలీ పండుగను జరుపుకుంటారని పురాణాలు చెబుతున్నాయి.

సహజసిద్ధమైన రంగులు ఆరోగ్యకరం

నిర్మల్‌చైన్‌గేట్: హోలీ వేడుకల్లో సహజ సిద్ధమైన రంగులు వాడితేనే ఆరోగ్యకరం. కెమికల్స్ కలిసిన రంగుల వాడకంతో చర్మం ఎర్రబడడం, దద్దుర్లు రావడం, తిమ్మిర్లతో పాటు కళ్లలో పడితే చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే హోలీ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో మోదుగ, బంతి, కుసుమ పూల నుంచి పసుపు రంగు, గోరింటాకు నుంచి ఆకుపచ్చ రంగు, ఎర్రచందనం, జాప్రా మొక్కల నుంచి ఎరుపు రంగు, వాయిలాకుల నుంచి నలుపు రంగును తయారు చేసేవారు. వీటి ఆకులు, పూల రెక్కలు, విత్తనాలను వేడి నీటిలో బాగా ఉడకబెట్టి తయారుచేసిన రంగులు ఆరోగ్యానికి శ్రేయస్కరం. నిమ్మ, పసుపు, కుంకుమను వాడడంతో తయారయ్యే ఈ రంగులు వసంత రుతువు ప్రారంభంతో వాతావరణంలో కలిగే మార్పులను శరీరానికి తట్టుకోగలిగే శక్తిని అందిస్తాయని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు.

రసాయన రంగులతో జాగ్రత్త



హోలీకి వినియోగించే రసాయన రంగులతో చర్మవాధులు వచ్చే ప్రమాదం ఉంది. గ్రీస్, ఆయిల్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. ఇలాంటి రంగులతో చర్మంపై దురద, దద్దుర్లు, ఇతర చర్మవ్యాధులు వస్తాయి.

– డాక్టర్ అమరేశ్వర్, చర్మవ్యాధుల నిపుణులు

ప్రకృతి సిద్ధమైన రంగులే మేలు



ప్రకృతి సిద్ధంగా లభించే రంగులు వాడడంతోనే ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరుగుతుంది. కళ్లలో రంగుపడితే నలవడం, రుద్దడం చేయకుడదు. చల్లని నీటితో కళ్లను శుభ్రం చేసి అవసరమైతే నేత్ర వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ సురేశ్, నేత్ర వైద్య నిపుణులు



మంటల పై నుంచి దూకుతున్న ఆదివాసీలు

అన్ని పండుగలకు భిన్నంగా..



అన్ని పండుగలకంటే భిన్నంగా హోలీని జరుపుకుంటాం. అంతా ఒక్కటై కాముని పున్నమిని జరుపుకుంటాం. ఇందులో కుడుకల ఆచారం చాలా ముఖ్యమైనది. కాముని దహనం తర్వాత అందరం రాత్రంతా ఇక్కడే బస చేయడం ఆనవాయితీ.

– పెందోర్ భీంరావు, గ్రామ పటేల్, చిన్నసాకడ

తరాలుగా వస్తున్న ఆచారం



మాతాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమిది. అన్ని గ్రామాల్లోని ఆదివాసీలు ఈ పండుగలకు అతీతులే. ప్రతిఒక్కరూ ఈ ఆచారాలు పాటించాల్సించే. హోలీ వేడుకలను పురుషులు మాత్రమే జరుపుకుంటారు.

– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

ఆదివాసీ గూడేల్లో కామ దహనం



ఘనూర్‌లో కుటుంబాల నుంచి కుడకలు సేకరిస్తున్న గ్రామపెద్దలు

ఉట్నూర్‌రూరల్: జిల్లాలో హోలీ సంబరాలు ఆరంభంతో ఆదివాసీ గూడేల్లో గిరిజనులకు ప్రత్యేకం. ప్రతిఏటా పండుగ రోజున ప్రతి కుటుంబం గ్రామస్తుల సమక్షంలో గ్రామపెద్ద (పటేల్) ఇంట్లో కుడక ఇచ్చి గ్రామ కుటుంబాల జాబితాలో చేరడం ఆనవాయితీగా వస్తోంది. తరాలు మారిన ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఆ రోజు కుడక ఇవ్వని కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించినట్లు పరిగణిస్తారు. పెళ్లి జరిగిన.. కొత్త కాపురం ప్రారంభించిన.. ఇతర గ్రామం నుంచి ఓ గ్రామానికి నివాసం వచ్చిన.. జాబితాలో చేరడం వారి ఆనవాయితీ. విధి నిర్వహణలో జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తమ స్వగ్రామాలకు చేరుకుని కుటుంబవంతు కుడక సమర్పించాలి. పండుగ రోజున గ్రామంలో జమ చేసిన కుడకలను అన్నింటిని వెదురు బొంగులకు ప్రకృతి వనరులతో అలంకరించి కామదహనం చేశారు. అగ్గిపెట్టే వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా ఉన్న రాయితో కొట్టి పుట్టించిన అగ్గితో దహనం నిర్వహించారు. మరుసటి రోజు ప్రత్యేక వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ రంగుల హోలీ ఆడుతారు. మోదుగ చెట్టు పూలతో తయారీ చేసిన రంగుతో యువతి, యువకులు హోలీలో పాల్గొంటారు. చిన్నారులకు చక్కెర బిల్లలు ధరిస్తూ మర్యాదలు ఇచ్చిపుచ్చుకుంటారు. కాగా, ఏజెన్సీ ప్రాంతంలో హోలీ వేడుకలో భాగంగా సుద్దగూడ, రాజదేవుషాగూడ, ఘన్పూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో సోమవారం కామ దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు తోపాటు, గ్రామ పటేళ్లు, గ్రామస్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీ పనులు పరిశీలన



పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్

కడెం/దస్తురాబాద్: కడెం మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీ పనులను విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం సఫారీలో వాచ్ టవర్లు, లక్ష్మీపూర్, అకొండపేట్ బీట్ పరిధిలోని గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. సీసీఎఫ్ శర్వణన్, డీఎఫ్‌వో సునీల్ హేరమత్, ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్ఆర్వో అనిత, డీఆర్వోలు సిద్దార్థ, ప్రకాశ్, ఎఫ్‌బీవో ఆలీం ఉన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్



అర్జీలు స్వీకరిస్తున్న కనక భీంరావ్

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి 34 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్య పరిష్కారం కోసం అందించే అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- అగ్నిప్రమాదంలో కిరాణ షాపు దగ్ధమవడంతో కుటుంబం రోడ్డున పడిందని, జీవనోపాధి కోసం దుకాణం పెట్టుకోవడానికి ఐటీడీఏ ద్వారా రుణం అందించాలని ఆదిలాబాద్ మండలం తిప్పాకు చెందిన అడ మోహపత్ అర్జీ పెట్టుకున్నాడు.
- తన పంట సాగుకు గిరి వికాసం పథకం ద్వారా విద్యుత్ మోటార్, బోర్ బావి మంజూరు చేయాలని రెబ్బెన మండలం సింగాల్‌గూడకు చెందిన నాగవత్ విన్నవించాడు.
- స్వయం ఉపాధి కోసం తమకు చేపలు పట్టడంలో ఐటీడీఏ ద్వారా శిక్షణ ఇప్పించాలని భీమారం మండలం రాంపూర్‌కు చెందిన గిరిజనులు వేడుకున్నారు.
- డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని భీంపూర్ మండల కేంద్రానికి చెందిన తుమ్రా తుల సీరాం అర్జీ పెట్టుకున్నాడు.
- తాను సాగు చేసుకుంటున్న పోడు భూమికి అటవీ హక్కుల పత్రం మంజూరు చేయాలని జైనూర్ మండలం పోచంలొద్దికి చెందిన కనక మాన్కు వేడుకున్నాడు.

రావి చెరువు వద్ద రైతుల ఆందోళన



పెంబి: మండలంలోని నాగాపూర్ సమీపంలో అటవీ ప్రాంతంలో రావి చెరువు గత మూడేళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. పూర్తి దశకు చేరిన చెరువు నిండు కుండలా కళకళలాడుతోంది. దీంతో బ్యాక్‌వాటర్ అటవీ ప్రాంతంలోకి వెళ్లడంతో చెట్లు ఎండిపోతాయని ఫారెస్ట్ అధికారులు ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. దీంతోపాటు తర్లపాడ్ గ్రామంలోకి నీరు చేరింది. సర్వే చేపట్టిన అధికారులు 7 మీటర్లు ఉన్న అలుగుని 3 ఫీట్లకు తగ్గించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఏకంగా బాంబు బ్లాస్ట్‌తో తొలగించడంతో చెరువు అలుగు పూర్తిగా దెబ్బతిందని గ్రామ రైతులు రావి చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. ఇరిగేషన్ జేఈ ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. రావి చెరువు అలుగు 3 ఫీట్లు తొలగించాలని అధికారుల ఆదేశాలమేరకు గ్రామస్తులతో ఒప్పందం చేసుకున్నామన్నారు. బాంబులతో బ్లాస్ట్ చేసింది మాత్రం మాకు తెలియలేదని, అయినా చెరువు అలుగు రెండు ఫీట్ల మేర మాత్రం తొలగిపోయిందన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి

ఉట్నూర్: చట్టాలు, హక్కులపై మహిళలు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు అధికమవుతున్నాయని అన్నారు. సమాజంలో వీటిని ఎదుర్కోవా లంటే చట్టాలు గురించి తెలుసుకోవాలన్నా రు. మహిళలపై వివక్ష, లైంగిక వేధింపులు, గృహహింస, దిశ చట్టం, బాల్య వివాహాలు, మానసిక సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ అథా రిటీ మండల కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి దుర్గారా ణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, న్యా యవాదులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ ఆహార కేంద్రం పరిశీలన

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎక్స్‌రోడ్డులో గల ఆదివాసీ ఆహార కేంద్రాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి పరిశీలించారు. కేంద్రంలో ఇప్పపువ్వు లడ్డూ, ఇప్ప పువ్వుతో తయారీ చేస్తున్న వివిధ రకాల తినుబండారాలను పరిశీ లించారు. కాగా, ములుగు జిల్లా ఏటూరునాగారంలో త్వరలో ఇప్ప పువ్వు లడ్డూ త యారీ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఆ జిల్లాకు చెందిన 20 మంది మహిళలు ఉట్నూర్‌లోని కేంద్రంలో ఇప్పపువ్వు లడ్డూ తయారీకి సంబంధించి మూడు రోజులుగా శిక్షణ పొందుతున్నారు. విఠల్‌రావు, బాగుబాయి తదితరులున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

భైంసా: బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధురాలిని స్థానికులు గమనించి కాపాడారు. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కంజర్లకు చెందిన రామర్తి లక్ష్మి (70) సోమవారం గోదావరి నదిలో ఆత్మహత్యకు యత్నించగా, స్థానికులు గమనించి ఆమెను కాపాడారు. పోలీసులకు సమాచారమివ్వగా, వారు కుటుంబీకులను పిలిపించి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఇద్దరు బైక్‌పై రిమ్స్ వైపు వస్తుండగా స్కూల్ బస్సు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. టూటౌన్ ఎస్సై ఊశన్న కథనం ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన తండ్రి కొడుకులు విలాస్, అనిల్ ఈనెల 4న సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి రిమ్స్ వైపు బైక్‌పై వస్తుండగా స్పిన్నింగ్ మిల్లు మూలమలుపు వద్ద ఓ స్కూల్ బస్సు ఢీకొట్టింది. దీంతో వారికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు, అటు నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. విలాస్ భార్య మునేశ్వర్ గోదావరి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆరుగాలం శ్రమ.. పశువులకు మేత



లోకేశ్వరం: పుడమితల్లిని నమ్ముకుని అన్నదాత ఆరుగాలం శ్రమించినా చివరికి ఫలాలు అందులేకపోగా..నష్టాలు మూటగట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన రాజు తనకున్న నాలుగెకరాల్లో యాసంగిలో వరి సాగు చేశాడు. పంటకు మొగి పురుగు సోకడంతో పిచికారి చేసినా ఫలితం లేకపోయింది. దీంతో రైతు తన పంటను పశువులు, గొర్రెలకు మేతగా వదిలేశారు.

'మంత్రిపై ఆరోపణలు మానుకోవాలి'

లక్ష్మణచాంద: మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం మానుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్‌చైర్మన్ రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ లక్ష్మణచాంద మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. ఇటీవల లక్ష్మణచాందకు వచ్చిన మంత్రి తన పేరిట కలెక్టరేట్ సముదాయం వద్ద గుంట భూమి ఉన్నా, డీ1 పట్టాతో భూమి ఉన్నట్లు ఎవరైనా నిరూపిస్తే ఆ భూమి వారికే రాసిస్తానని తెలిపారని గుర్తు చేశారు. పండుగలకు మాత్రమే జిల్లాకు వచ్చిపోయే మహేశ్వర్‌రెడ్డి మంత్రిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఐకేరెడ్డి నిర్మల్ జిల్లా సాధించారని, మెడికల్ కళాశాల మంజూరు చేయించారని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 600 ఆలయాల నిర్మిస్తున్నారని వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గంగారాం, నాయకులు పాల్గొన్నారు.